VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

ఆదివారం 07 ఏప్రిల్ 2024

సంపుటి.01 సంచిక.246

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై
# సిబిఐ విచారణ



గవర్నర్‌ను కలసి కోరిన బిజెపి బృందం

సిబిఐకి అప్పగిస్తేనే దోషులు బయటపడతారు

రేవంత్ సర్కార్ ఉదాసీనంగా ఉందన్న లక్ష్మణ్

2లో..



## బిఆర్ఎస్‌ను తొక్కినట్లే..
# బిజెపిని తొక్కుతాం

**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పట్టిన గతే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కార్యకర్తల చెమట చిందించడం వల్ల తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిందని గుర్తుచేశారు. బిఆర్ఎస్‌ను తొక్కినట్లే బిజెపిని కూడా తొక్కాలన్నారు. పదేళ్లుగా ప్రధాని పదవిలో ఉన్న మోడీ..మరోమారు ఎందుకు ప్రధాని కావాలని అడిగారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వనందుకా..రైతులపై కాల్పులు జరిపినందుకా అంటూ విమర్శలు గుప్పించారు. తుక్కుగూడలో జరిగిన జన జాతర సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. గోదావరి, కృష్ణా నది పోటెత్తి సునామీ సృష్టిస్తే ఎలా ఉంటుందో తుక్కుగుడ అలా కనిపిస్తోందని కార్యకర్తలను రేవంత్ రెడ్డి ఉత్తేజ పరిచారు. తమపై గుజరాత్ ఆధిపత్యం నడవదని తేల్చిచెప్పారు.ఉద్యోగాల పేరుతో బీజేపీ మోసం చేసిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రైతులను చంపినందుకు బీజేపీకి ఓటేయాలా? మతాల మధ్య చిచ్చు పెట్టినందుకు వేయాలా..? అని రేవంత్ అడిగారు. ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య చిచ్చు పెట్టి మరోసారి అధికారంలోకి వద్దామని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. హైదారాబాద్‌లో వరదలు వస్తే ప్రధాని మోదీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. మోదీకి తెలంగాణ అంటే చిన్న చూపు అని వివరించారు. నమో అంటే కొత్త అర్థం చెప్పారు. నమ్మితే మోసం పోవడం ఖాయం అన్నారు. బీజేపీని బొంద పెట్టే వరకు నిద్రపోవద్దని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఎలా ఓడించారో.. బీజేపీని అలాగే ఓడించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని.. జూన్ 9న ఢిల్లీలో మువ్వన్నెల జెండా ఎగరాలని అన్నారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని.. వారి కష్టం వల్లే రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని పేర్కొన్నారు. 'కేసీఆర్ పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో వందేళ్ల విధ్వంసం సృష్టించారు. వారు ఏం మాట్లాడినా చూస్తూ ఊరుకుంటాం అని కేసీఆర్ అనుకుంటున్నారు.

అలా ఊరుకోవడానికి నేను జానారెడ్డిని కాదు.. రేవంత్ రెడ్డిని. ఎలా పడితే అలా మాట్లాడితే కేసీఆర్ ను జైల్లో
పెడతాం. ఆయనకు చెర్లపల్లి జైలులో చిప్పకూడు తినిపించడం ఖాయం. నువ్వు పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టివ్వలేదు. నేను మాత్రం నీకు తప్పకుండా చెర్లపల్లి జైలులో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిస్తా. ఆయన కాలు విరిగింది. కూతురు జైలుకెళ్లారని జాలి చూపించాం అన్నారు.
బిడ్డ, కొడుకు, అల్లుడు, ఆయన అందరూ కలిసి ఉండేలా ఇల్లు కట్టిస్తానని అన్నారు. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోనని కేసీఆర్‌కు రేవంత్ వార్నింగ్ ఇచ్చారు.

- నమో అంటే..నమ్మించి మోసం చేయడం
- ఇచ్చిన హామీలు అమలు చేయని మోడీకి ఓటెందుకు
- మద్దతు ధరలు ఇవ్వనందుకా...
- రైతులను కాల్చి చంపినందుకా ?
- ఉద్యోగాల పేరుతో మోసం చేసినందుకా..
- ఎందుకు బిజెపికి ఓటేయాలో ప్రజలు ఆలోచించాలి
- కెసిఆర్ ఇష్టం వచ్చినట్లే మాట్లాడితే చర్లపల్లిలో చిప్పకూడు ఖాయం
- తుక్కుగూడ సభలో ఘాటు విమర్శలు చేసిన సిఎం రేవంత్

## ఎన్నికల బాండ్లు.. పెద్ద కుంభకోణం

హైదరాబాద్: దేశంలో ఎలక్టోరల్ బాండ్ల పేరిట భాజపా ప్రభుత్వం అతిపెద్ద కుంభకోణానికి పాల్పడిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మౌలిక సదుపాయాల సంస్థలను బెదిరించి, భయపెట్టి రూ.కోట్ల బలవంతపు వసూళ్లకు పాల్పడిందని.. ఆ సంస్థలకు రూ.వేల కోట్ల ప్రాజెక్టులు మంజూరు చేసిందని ఆక్షేపించారు. తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్ వేల మంది ఫోన్లు ట్యాప్ చేశారని.. ఇందుకు పోలీసులను తప్పుదారిలో ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తారు. కేంద్రంలోనూ ప్రధాని మోదీ, భాజపా నాయకులు ఇదే పనిచేస్తున్నారన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని ఎక్స్‌టార్షన్ డైరెక్టరేట్‌గా భాజపా ప్రభుత్వం మార్చిందని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు.శనివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జనజాతర సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. తెలంగాణలో భాజపా 'బీ' టీం అయిన భారాసను ఓడించామని.. లోక్‌సభ ఎన్నికల్లో భాజపానూ ఓడించబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హామీలతో కూడిన మ్యానిఫెస్టో 'న్యాయపత్ర' తెలుగు ప్రతిని ఆయన విడుదల చేశారు.

## ఆర్టీసీలో పెరుగుతున్న
# ఖాళీలు!



ఆర్టీసీలో ఓవైపు ప్రయాణికులు గణనీయంగా పెరుగుతుండగా.. పదవీ విరమణల కారణంగా సిబ్బంది సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. దీంతో సంస్థలో ఖాళీలు పెరుగుతున్నాయి.

ఏప్రిల్-డిసెంబరు మధ్య మరో 1,354 మంది పదవీ విరమణ

మహాలక్ష్మి పథకంతో గణనీయంగా పెరిగిన ప్రయాణికులు

**హైదరాబాద్:** ఆర్టీసీలో ఓవైపు ప్రయాణికులు గణనీయంగా పెరుగుతుండగా.. పదవీ విరమణల కారణంగా సిబ్బంది సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. దీంతో సంస్థలో ఖాళీలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుండటంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య సగటున రోజుకు అరకోటి దాటుతోంది. ఈ పథకం ముందునాటి పరిస్థితితో పోలిస్తే రోజుకు దాదాపు 15 లక్షల మంది అదనంగా ప్రయాణాలు చేస్తున్నారు. మరోవైపు సంస్థలో పలువురు ఉద్యోగులు రిటైర్ అవుతున్నారు. మార్చి నెలాఖరులో 176 మంది పదవీ విరమణ పొందగా.. ఈ ఏప్రిల్-డిసెంబరు మధ్య మరో 1,354 మంది రిటైర్ కానున్నారు. వీరిలో డ్రైవర్లు 403 మంది.. కండక్టర్లు 350 మంది ఉన్నారు.



## మండుటెండల్లో
# చల్లటి వార్త

**రెండ్రోజుల్లో అక్కడక్కడా వర్షాలు వాతావరణశాఖ వెల్లడి**

**హైదరాబాద్:** ఎండలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణశాఖ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో రాగల రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు కురుస్తాయని పేర్కొంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో రాత్రిళ్లు వేడిగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఆదివారం ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ వేడి, తేమతో కూడిన పరిస్థితులుంటాయని చెప్పింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో రాత్రిపూట వేడిగా ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే ఛాన్స్ ఉందని వివరించింది.

# రైతు సమస్యలపై బిఆర్ఎస్ సమరభేరీ

కెసిఆర్ ప్రజలకోసం ఎర్రటి ఎండలో వచ్చారు

సిఎం రేవంత్ మాత్రం ఐపిఎల్ మ్యాచ్‌లు చూశారు

మేడిగడ్డ నుంచి 200 క్యూసెక్కుల నీళ్లు వృథా

పిల్లర్లు కుంగాయంటూ బద్‌నామ్ చేస్తూ పోతున్నారు

ఎన్నికల హామీల అమలులో పూర్తి నిర్లక్ష్యం

రైతుదీక్షలో బిఆర్ఎస్ నేత కెటిఆర్ విమర్శలు

2లో..



## సిబిఐకి అనుమతిపై
## కోర్టులో కవిత సవాల్

న్యూఢిల్లీ: భారాస ఎమ్మెల్సీ కవిత దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దిల్లీ మద్యం కేసులో సీబీఐ విచారణకు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేశారు. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది నితీష్ రాణా కోర్టులో మెన్షన్ చేశారు. ఆమెను సీబీఐ ప్రశ్నించే అంశంపై విచారణ చేపట్టాలని కోరారు. ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సీబీఐ సమయం కోరింది. దీంతో ఈ నెల 10 వరకు సమయం ఇచ్చినట్లు కోర్టు తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 10న చేపట్టనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. కస్టడీలో ఉన్న కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి శుక్రవారం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.



## దేశ ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు

370 సీట్ల లక్ష్యం కోసం విపక్షాలకు బెదరింపులు

రాజ్యాంగాన్ని మార్చేందుకు మోడీ కుట్రలు

జైపూర్ ఎన్నికల ప్రచారంలో సోనియా విమర్శలు

2లో..



# రైతు సమస్యలపై బిఆర్ఎస్ సమరభేరీ

**రాజన్నసిరిసిల్ల:** తెలంగాణలో వ్యవసాయం సంక్షోభంలో ఉందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే ఈ దుస్థితి ఊహించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్ లో రైతు దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రటి ఎండలో ప్రజల్లోకి తిరిగితే.. సీఎం రేవంత్ రెడ్డి ఐపీఎల్ మ్యాచులు అంటూ తిరుగుతున్నారు. కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను పంపించి దున్నపోతును తెచ్చుకున్నామని ఆవేదన చెందుతున్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని అడిగితే ఎన్నికల కోడ్ ఉందని అంటున్నారు. చిత్తశుద్ధి ఉంటే సీఎం రేవంత్ ఎన్నికల కమిషన్ కు లేఖ రాయాలి. మేము కూడా ఉత్తరం రాస్తాం. కరువు వస్తే మమ్మల్ని తిడుతారా.? అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఏడాది 14 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ విమర్శలు గుప్పించారు. మేడిగడ్డ నుంచి 200 క్యూసెక్కుల నీళ్లు వృథాగా పోతున్నాయి. మేడిగడ్డలో పిల్లర్లు కుంగితే రిపేర్ చేయకుండా కేసీఆర్ ను బద్నాం చేస్తున్నారు.' అంటూ కేటీఆర్ మండిపడ్డారు. 'అప్పుడు వర్షాలు పడి పంటలు మునిగిపోయాయని మంత్రి శ్రీధర్ బాబు గగ్గోలు పెట్టారు. ఇప్పుడు వర్షాలు పడలేదని అంటున్నారు. ఎన్నికల ముందు రైతుబంధు కోసం రూ.7 వేల కోట్లు సిద్ధంగా పెట్టాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆ డబ్బులు ఇవ్వొద్దని కాంగ్రెస్ ఆపింది. ఇప్పుడు ఆ డబ్బులు ఏమయ్యాయో చెప్పాలి. తెలంగాణకునీళ్లు రావాలంటే ఎత్తిపోతలే మార్గం. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు నిర్మించాం. భారీ మోటార్లు పెట్టి గోదావరి నీళ్లు ఎత్తిపోశాం. ఇవాళ కూడా గోదావరిలో 2 వేల క్యూసెక్కుల నీళ్లు పోతున్నాయి. 300 పిల్లర్లు ఉన్న బ్యారేజీలో 2 పిల్లర్లు కుంగితే ప్రాజెక్ట్ మొత్తం కొట్టుకుపోయిందని దుష్ప్రచారం చేస్తున్నారని అంటూ మండిపడ్డారు. 'డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటికీ ఒక్క మాట ఎందుకు మాట్లాడటం లేదు. ఎన్నికల్లో ఓడిపోయామని రైతుల తరఫున కొట్లాడకుండా ఆగుతామా?. వారికి అండగా నిలబడేందుకు ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త సిద్ధంగా ఉండాలి. రైతు భరోసా, రూ.4 వేల పెన్షన్, రూ.2 లక్షల రుణమాఫీ వచ్చిన వాళ్లు కాంగ్రెస్ కు ఓటెయ్యండి. రాని వాళ్లు మాకు ఓటెయ్యండి. హామీలను నెరవేర్చకుంటే ప్రజలు మమ్మల్ని తిరస్కరిస్తారన్న భయం కాంగ్రెస్ పార్టీలో మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి కొరత ఉంది. మిషన్ భగీరథ నిర్వహణ కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదు. హామీలపై సర్కారును నిలదీద్దాం. 420 కాంగ్రెస్ హామీలను ప్రతి ఒక్కరికీ గుర్తు చేయాల్సిన అవసరం ఉంది. 30 వేల ఉద్యోగాలు ఇచ్చా అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి.. మీ ప్రభుత్వం వచ్చాక ఎన్ని నోటిఫికేషన్లు ఇచ్చిందో చెప్పాలి. ఈ రోజు రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. నేతన్నల కోసం టీఆర్ఎస్ పార్టీ దీక్షలు చేస్తోంది. ప్రభుత్వం నేతన్నలను ఆదుకునే వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# షర్మిల ఓ పెయిడ్ ఆర్టిస్ట్

**అమరావతి:** పీసీసీ చీఫ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పెయిడ్ ఆర్టిస్టుగా ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అభివర్ణించారు. తాడేపల్లిలోని వైసీపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడుతూ..కడప లోక్‌సభ బరిలోకి దిగిన షర్మిల తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డనని .. వైఎస్ అవినాష్ రెడ్డి వివేకాను చంపిన వ్యక్తి అని.. ఎవరికి ఓటు వేయాలో ఆలోచించాలని ప్రజల్ని కోరుతున్నారు. హంతకుల ప్రభుత్వం పోవాలంటే సీఎం జగన్ ను ఓడించాలని పిలుపునిస్తున్నారు. ఈ అంశంపై సజ్జల రామకృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. షర్మిల ఇవ్వాల్సిన సంజాయిషీలు చాలా ఉన్నాయన్నారు. తెలంగాణ నుంచి హఠాత్తుగా షర్మిల ఎందుకు మాయం అయ్యారని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఏపీ వచ్చి కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారని.. వాటిని ఎవరిచ్చారన్నారు. షర్మిల కాంగ్రెస్ బాధ్యతలు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో కొట్లాడుతానని తెలంగాణలో పార్టీ పెట్టారని.. .ఇప్పుడు పెయిడ్ ఆర్టిస్ట్‌లాగా మాట్లాడుతున్నారని మండపడ్డారు. వివేకా హత్య కేసు గురించి నాలుగేళ్లుగా మాట్లాడని ఆమె.. ఇప్పుడెందుకు మాట్లాడుతున్నారన్నారు. మరో నెలలో ప్రజాకోర్టులో ఇదంతా తేలుతుందన్నారు. మీడియా సమావేశంలో చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. జనసేన, బీజేపీలో ఉన్నవాళ్లకు నిరాశే కలిగిందని.. చంద్రబాబు ఎవరికి అనుకుంటే వాళ్లకు సీట్లు ఇచ్చేలా చేశారన్నారు. తన మనుషులకే టికెట్లు ఇప్పించుకున్నారు. బీజేపీలో కూడా బాబు చెప్పినట్లే సీట్లు ఖరారు అయ్యాయన్నారు. అయినా 2019 ఎన్నికలంటే టీడీపీ ఘోరంగా ఓడిపోబోతోందన్నారు. 2019లో అధికారంలో ఉన్నప్పుడు కూడా చంద్రబాబు తీరు ఎలా ఉందో అందరికీ తెలుసు. ఆయన పాలనను ప్రజలు మరిచిపోలేదు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఈవో మీదకు దూకుడుగా వెళ్లారు. దబాయించి మాట్లాడారన్నారు. చంద్రబాబు కక్షతో వలంటీర్ వ్యవస్థపై విష ప్రచారం చేసింది. ఇప్పుడు ఎన్నికల ముందు ఆ వ్యవస్థను దూరం చేసింది. తన ఏజెంట్ నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించారు.వృద్ధులకు, దివ్యాంగులకు ఫించన్లు, పథకాలు అందకుండా కుట్ర చేస్తోంది. వలంటీర్ వ్యవస్థ వల్ల రెండ్రోజుల్లో ఫించన్ల పంపిణీ పూర్తయ్యేది. కానీ, ఇప్పుడది ఆలస్యం అయ్యింది. దీంతో పెన్షనర్లలోనూ ఆందోళన వ్యక్తం అయ్యింది. దురదృష్టవశాత్తూ.. ఎండలకు తాళలేక కొందరు చనిపోయారు. అధికారులపైనా చంద్రబాబు అండ్ కో ఫిర్యాదు చేశారు. చంద్రబాబు రాక్షస మనస్తత్వం ఏ నాయకుడిలో కనిపించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ వ్యవస్థ పారదర్శకంగా పని చేస్తోంది. కోవిడ్ సమయంలోనూ సీఎం జగన్ ఒక్క పథకం కూడా ఆపకుండా అందించారన్నారు. ఇకపోతే చంద్రబాబు తన కూటమిలోని వాళ్లనే చిన్న చూపు చూస్తున్నారని.. ఆయన వల్లే బీజేపీ, జనసేనకు అసలు ఉనికే లేకుండా పోయిందని రామకృష్ణారెడ్డి అన్నారు. ఓటమిని గ్రహించే చంద్రబాబు పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్నారని, ప్రజలకు సంక్షేమం అందకుండా కుట్రలు చేస్తున్నారని సజ్జల మండిపడ్డారు.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిబిఐ విచారణ

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ రాష్ట్ర బీజేపీ తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌ను కోరింది. ట్యాపింగ్ కేసు పూర్తి వివరాలతో ముఖ్య నాయకులంతా ఓ లేఖ రాశారు. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీస్ ఉన్నతాధికారులు అరెస్ట్ అయ్యారని లేఖలో నేతలు తెలిపారు. మరికొందరు పోలీసుల పై దర్యాప్తు కొనసాగుతున్నదని ..ఈ ట్యాపింగ్‌లో గత పాలకుల ప్రమేయం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని గుర్తు చేశారు.ఈ కేసులో నిజనిజాలు వెలుగులోకి రావాలంటే సిబిఐ విచారణ జరపాలని గవర్నర్ ను అభ్యర్థించింది. లేఖపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఎంపి లక్ష్మణ్ తో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతకాలు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కు ఎవరు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. అందుకు సీబీఐకి ఈ కేసును అప్పగిస్తేనే అసలు దోషులు బయటపడతారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేయడం అత్యంత దారుణమని అన్నారు. ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని ఈ వ్యవహారం నడిచిందన్న వార్తలు కలవరపెడుతున్నాయన్నారు. సీబీఐకి ఈ కేసును అప్పగించినప్పుడే న్యాయం జరుగుతుందని కె. లక్షణ్ అన్నారు. ప్రభుత్వం కూడా సీబీఐకి అప్పగించి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై టామ్ అండ్ జెర్రీ మాదిరి కాంగ్రెస్, బీఆర్ఎస్ కొట్టుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. దేశ భద్రతకు భంగం కలిగించేలా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సాగిందని, ఇందులో అసలు సూత్రధారులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. ప్రధాని మోదీ పదేండ్ల పాలన, అభివృద్ధిపై చర్చ జరగకుండా బీఆర్ఎస్, కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం, ధరణి, ఫోన్ ట్యాపింగ్ లాంటి అంశాలతో ప్రతిరోజు పతాక శీర్షికల్లో వార్తలు వచ్చేలా రేవంత్ కుట్రలు చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ అనేక ఆరోపణలు చేసిందని, కానీ చర్యలు మాత్రం తీసుకోవడం లేదని లక్ష్మణ్ మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. కానీ దానిపై ఇప్పటి వరకు విచారణ జరిపించలేదు. ధరణి పోర్టల్ పై కమిటీ వేసి మసిపూసి మారేడుకాయ చేశారు. మద్యం విక్రయాలు, విద్యుత్ కొనుగోళ్లలోనూ అవినీతి జరిగింది. వాటిపైనా విచారణ జరిపించడం లేదని ఫైర్ అయ్యారు. 2018అసెంబ్లీ ఎన్నికలు, 2019 పార్లమెంట్ ఎన్నికలు, దుబ్బాక, మునుగోడు బై ఎలక్షన్లలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా దొరికిందే ఫోన్ ట్యాపింగ్ వల్ల. ఇవన్నీ తెలిసి కూడా ఎందుకు ఉపేక్షిస్తున్నారో.. రేవంత్ సర్కార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# హత్యకేసు నిందితుడికి టిక్కెట్ ఎలా ఇస్తారు

**కడప:** వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డికి సీఎం జగన్ టికెట్ ఎలా ఇస్తారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. కడపలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆమె పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మాట్లాడారు. వివేకా కేసులో అవినాశ్‌ను సీబీఐ నిందితుడిగా తేల్చిందన్నారు. బాబాయి హత్య విషయంలో జగన్ ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని కోరారు. హత్య రాజకీయాలను ప్రోత్సహించే వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సీబీఐ నిందితుడిగా ఉన్న అవినాష్ రెడ్డికి మళ్లీ ఎలా టిక్కెట్ ఇచ్చారని ప్రశ్నించారు. బాబాయి హత్య విషయంలో జగన్ ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. సీబీఐ విచారణ ఎందుకు వద్దన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నేరం చేయకపోతే విచారణకు ఎందుకు అడ్డుపడుతున్నారని ఆక్షేపించారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహించే వారికి బుద్ధి చెప్పాలని కోరారు. కడప ప్రజలకు అందుబాటులో ఉంటా.. వైఎస్సార్ లాగా సేవ చేస్తా అని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. ముస్లింలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిన జగన్.. ఒక్కటైనా నెరవేర్చారా?. ముస్లింల పక్షాన నిలబడేది కాంగ్రెస్ మాత్రమే. స్థానిక ఎంపీ అవినాష్ రెడ్డి ఒక్క రోజు కూడా కడప స్టీల్ ఎ÷-లాంట్‌పై మాట్లాడలేదు. కడప ప్రజలకు నేను ఎప్పుడూ అందుబాటులో ఉంటా. వైఎస్సార్‌లా సేవ చేస్తానని షర్మిల అన్నారు.జగన్మోహన్ రెడ్డి బీజేపీకి బానిస షర్మిల అన్నారు. గోద్రాలో దాడులు జరిగితే జగన్ నోరు విప్పలేదని మండిపడ్డారు. బీజేపీ అంటేనే గిట్టని వైఎస్సార్ కు బీజేపీకి బానిస అయిన జగన్ వారసుడు ఎలా అవుతారని ప్రశ్నించారు.

# కెసిఆర్ రావడంతో మంత్రులకు నిద్రపట్టడం లేదు

**సంగారెడ్డి:** కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తే మంత్రులకు నిద్ర పట్టడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. జహీరాబాద్ లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై మంత్రులు చేసిన వ్యాఖ్యలపై ఆయన తిప్పికొట్టారు. మంత్రులు తమకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని.. రైతుల సమస్యల గురించి కేసీఆర్ మాట్లాడితే అమాత్యులు ఆయన్ను తిడుతున్నారని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని అంటున్నారని.. ఆయనకు సిగ్గు ఉందా.? అంటూ నిలదీశారు. రాహుల్ గాంధీ తన మేనిఫెస్టోలో ఇతర పార్టీ వాళ్లను పార్టీలోకి తీసుకోవద్దని పెడతారని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ మంత్రులు మాత్రం ఇతర పార్టీల నుంచి తమ పార్టీలోకి తీసుకుంటామని అంటున్నారంటూ సెటైర్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల తర్వాత అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ అధికారంలోకి రాదని హరీష్ రావు జోస్యం చెప్పారు. 'మీరు ఎన్ని చేస్తారో చేయండి. కానీ గుర్తు పెట్టుకోండి. మేము వడ్డీతో సహా మీకు తిరిగి ఇస్తాం.' అని హెచ్చరించారు. మీరు ఎన్ని చేసినా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ మిమ్మల్ని వదిలిపెట్టమని.. వెంట పడతామని అన్నారు. లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. '200 మంది ఆత్మహత్య చేసుకుంటే కాంగ్రెస్ నేతలకు పరామర్శించడానికి సమయం లేదు. కేసీఆర్ హయాంలో పుట్ల కొద్దీ ధాన్యం పండితే.. కాంగ్రెస్ హయాంలో పుట్టెడు కష్టాలు ఎదురవుతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ చేయలేదు. ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయం చేయలేదు. పంటకు మద్దతు ధర ఇవ్వలేదు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ఒక్క హామీ నెరవేర్చలేదు. కేంద్రంలో ఉన్న బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే రైతులకు సహాయం చేయాలి. కేసీఆర్ కాలు పెట్టగానే బీజేపీ కళ్లు తెరిచి దీక్షలు చేస్తున్నారు. పంట ఎండిపోయిన రైతులకు వెంటనే ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలి. కాంగ్రెస్ నేతలు చిల్లర, బోగస్ మాటలు పక్కన పెట్టి రైతుల్ని ఆదుకోవాలి.' అని డిమాండ్ చేశారు. 'అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఊపు తగ్గింది. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి.. ఇప్పుడు ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకుంటున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, వడ్లకు, మక్కలకు రూ.500 బోనస్, రూ.4 వేల పింఛన్, రైతుబంధు రూ.15 వేలు, మహిళలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి కింద తులం బంగారం, రూ.4 వేల నిరుద్యోగ భృతి, ఆడపిల్లలకు ఉచిత స్కూటీ అందిన వాళ్లే కాంగ్రెస్ కు ఓటెయ్యండి.

అందని వాళ్లు బీఆర్ఎస్ కు ఓటెయ్యండి. ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి.' అంటూ హరీష్ రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపించారని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మడం లేదని బాండ్ పేపర్లు రాసి ఇచ్చి మరీ ప్రజలను మోసం చేశారన్నారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని, రెండు లక్షలు రుణమాఫీ చేస్తామన్నారని కానీ ఏ ఒక్కటీ చేయలేదన్నారు. రుణమాఫీ అయి ఉంటే కాంగ్రెస్ కు ఓటు వేయమని, కాకపోతే బీఆర్ఎస్ కు ఓటు వేయమని కోరారు హరీష్ రావు. కాంగ్రెస్ వచ్చింది కేసీఆర్ కిట్ బంద్ అయ్యిందని తెలిపారు. రైతులకు సాగునీరు, రైతు బంధు రావడంలేదని విమర్శించారు. బీబీ పాటిల్ బీఆర్ఎస్ లీడర్లను కొంటున్నారని ఆరోపించారు.

# గాంధీ కుటుంబ కనుసన్నల్లోనే పార్టీ

**షాడో అధ్యక్షుడిగా నేతలను శాసిస్తున్న రాహుల్**

**రాహుల్ సూచనలతోనే రానున్న ఎన్నికలపై వ్యూహం**




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం మారినా..పెత్తనం అంతా ఇప్పటికీ ఆ ముగ్గురి చేతుల్లోనే ఉంది. వారి కనుసన్నల్లోనే పార్టీ నడుస్తోంది. సోనియా,రాహుల్, ప్రియాంకలే నిర్దేశం చేస్తున్నారు. ఎందరు నేతలు ఉన్నా గాంధీ కుటుంబ సభ్యులకు మించిన నాయకులు కనపడడం లేదు. రాహుల్ స్థానంలో రాగలిగిన నాయకుడెవరూ కాంగ్రెస్‌లో కనపడడం లేదు. రానున్న రోజులన్నీ కాంగ్రెస్‌కు పరీక్షను నిలిపేవే. రాహుల్ పార్లమెంట్ ఎన్నికల పోరులో విజయం సాధించేందుకు ఎలా కష్టపడతారన్నదే ముఖ్యం. ఎందుకంటే ఇప్పటి వరకు అన్నాచెల్లెళ్లు పెద్దగా సాధించేదేమీ లేదు. అలాగే వారు సాధిస్తారన్న ఆశలు కూడా లేవు. ఇకపోతే వీరిని కాదని సోనియా ఎలాంటి నిర్ణయం తీసుకునేలా లేరు. మరీ ముఖ్యంగా అధికారం దక్కితే రాహుల్‌కే పగ్గాలు కట్టబెట్టాలన్నది సోనియా వ్యూహంగా ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తానిరూపించుకోవాల్సి ఉన్నది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కడా పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే కర్నాటక, ఆ తరవాత తెలంగాణలో అధికారం దక్కడంతో కొంత ఊరట లభించింది. ప్రియాంకకు పగ్గాలు అప్పగిస్తే ఏమైనా అదృష్టం మారుతుందా అని కూడా కొందరు ఆలోచన చేస్తున్నారు. కాంగ్రెస్‌ను తుడిచిపెడితే బిజెపికి దేశంలో ఇక తిరుగుండదు. ఆ తర్వాత భారత రాజకీయాలు పూర్తిగా బిజెపి చేతుల్లోకి మారుతాయి. ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ కూడా పూర్తిగా కనుమరుగు కానుంది. కాంగ్రెస్ కనుమరుగు అయితే ప్రాంతీయ పార్టీలను బలిచక్రవర్తిలా తొక్కేయాలని మోడీ చూస్తారు. వివిధ పద్ధతులతో మోదీ ప్రస్తుతం అనుసరిస్తున్న వ్యూహం కారణంగా కాంగ్రెస్ గింగిరాలు కొట్టుకుంటోంది. ఐటి శాఖ నోటీసులు, అకౌంట్లు సీజ్ చేయడం, జరిమానాలు విధించడం అంతా ఓ పద్ధతి ప్రకారం సాగుతున్నాయి. కాంగ్రెస్ విముక్త భారత్ అన్న నినాదం పూర్తిగా సాకారం అయ్యే దిశగా భారత రాజకీయాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పూర్తిగా అంతమయితే ప్రాంతీయ పార్టీలను తుడిచిపెట్టడం బిజెపికి పెద్ద విషయం కాకపోవచ్చు. ఎందుకంటే ప్రాంతీయ పార్టీలన్నీ అవినీతి ఊబిలో కూరుకుని పోయాయి. ఈ అవినీతే అస్త్రంగా మోడీ వాటిని దునుమడే అవకాశం ఉంది. బలమైన ప్రతిపక్షం లేకుంటే నిరంకుశ విధానాలు అవలంబించేలా ప్రభుత్వ విధానాలు ఉంటాయి. అది దేశానికి క్షేమకరం కాదు. కాంగ్రెస్ పునరుద్ధరణ కాంగ్రెస్‌కు మాత్రమే ముఖ్యం కాదు, మొత్తం ప్రజాస్వామ్యానికి, మన సమాజానికి కూడా ఎంతో ముఖ్యం అని గుర్తించాలి. కాంగ్రెస్ జీవన్మరణ సమస్య నెదుర్కొంటున్నదని స్పష్టంగా తెలుసు.

ప్రత్యర్థి చేతుల్లో ఓడిపోడం కంటే శాయశక్తులా పోరాడి కనీసం జీవించేందుకు ప్రయత్నించక తప్పనిసరి పరిస్థితిలో కాంగ్రెస్ ఉన్నది. ఇక ప్రస్తుతం ఓ ఎంపిగా మాత్రమే ఉన్న రాహుల్ షాడో అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాహుల్ నాయకత్వాన్ని ప్రశ్నించగల ధైర్యం కాంగ్రెస్ పార్టీలో ఎవరికీ లేదు. అయినా ఆయన భారత్ జోడో యాత్ర తరవాత పరిస్థితి మారుతోంది. క్రమంగా కాంగ్రెస్ పట్ల ప్రజల్లో కూడా ఆదరణ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉల్లఘించినా పెద్దగా పట్టింపు ఉండదు. రెండు రకాలుగా నేతలను కాంగ్రెస్ అధిష్టానం పోషించడం అనాదిగా వస్తోంది.

అందుకే అది అరాచక పార్టీగా పేరొందింది. అసమ్మతి లేకుండా గట్టిగా హెచ్చరికలు చేసిన దాఖలాలు లేదు. తెలంగాణలో ఇప్పుడు పిసిసి చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు కూడా ఆ బాధ తప్పడం లేదు. కాంగ్రెస్‌లో అసమ్మతి నడిపడం ద్వారా నేతగా బలపడాలన్నదే కొందరి లక్ష్యంగా ఉంటుంది. తాజా పరిణామాలతో పార్టీలో నాయకులు అందరినీ కలుపుకుని విజయం వైపు నడిపించాలన్న ఆలోచనలో రాహుల్ ఉన్నట్లుగా ఉంది.దాని గురించి ఆ పార్టీ నాయకులు ఆలోచించాల్సి ఉన్నది. ఇందుకు అవసరమైన విశ్వసనీయమైన సమిష్టి నాయకత్వ బృందం ఏర్పర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రాల్లో అసమ్మతి నేతలు చెలరేగకుండా చూసుకోవాలి. ముందు పార్టీలో చిల్లర రాజకీయాలను తగ్గించుకోవాలి. కలసికట్టుగా పోరాడాలన్న కార్యాచరణ సిద్దం చేసుకోవాలి. అప్పుడే కాంగ్రెస్ కొంతయినా ప్రభావం చూపగలదు.

# 94శాతం మందికి పెన్షన్ పంపిణీ

అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నాటికి సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 94 శాతం లబ్ధిదారులకు అందజేశామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించి రూ.1,847.52 కోట్లు నగదును పింఛనుదారులకు అందజేశామన్నారు.

శనివారం ఉదయం 7 గంటల నుంచి పింఛనుదారులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు పింఛన్ల పంపిణీ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలన్నారు.

ఇదిలావుంటే రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు పింఛనుదార్లను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడందారుణం.. ÷ూష్ట్రంలో ప్రతి అంశాన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం అటు ఎన్‌డిఎ కూటమి, ఇటు వైఎస్ఆర్‌సిపిలకు నిత్యకృత్యంగా ఉంది. రాజకీయ పార్టీలు ప్రజల ప్రయోజనాలు రక్షించాలి తప్ప తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ఈ విధంగా వాడుకోవడం తగని పని. మిగిలిన లబ్ధిదార్లకు పింఛన్లు ఇంటివద్దనే అందజేసేందుకు తగు చర్యలు చేపట్టాలి. ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్నందున అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో వుంటుంది కనుక వచ్చే రెండు నెలల పింఛన్లు అందరు లబ్దిదార్లకు ఇంటివద్దనే అందజేసేందుకు నిర్ణయించాలి. అందుకు ఎన్నికల కమిషన్‌తో సహా ఏయే సంస్థల అనుమతులు, సమ్మతులు అవసరమో వాటిని ఇప్పుడే పొందాలి. పేదలు మళ్లీ మళ్లీ బాధలనుభవించే పరిస్థితి రాకూడదు. పింఛను తీసుకుందామని పండు ముదుసలులు మండుటెండల్లో క్యూ లైన్లలో నిలబడి ఆ సొమ్ము పొందకుండానే రాష్ట్రంలో ఏడుగురు తనువు చాలించడం అత్యంత విచారకరం. ప్రతి నెలా ఒకటో తారీఖున లబ్దిదార్ల ఇంటివద్దకే పింఛను సొమ్మును గడచిన నాలుగేళ్లకు పైగా గ్రామ/ వార్డు సచివాలయ వలంటీర్లు అందజేస్తూవున్నారు. ఎన్నికల కోడ్ అమలులో వున్నందున వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయరాదంటూ సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ రాష్ట్ర హైకోర్టు లో వ్యాజ్యం దాఖలు చేయడంతో ఈ సమస్య ముందుకొచ్చింది. పింఛను వలంటీర్లు కాకుండా ప్రభుత్వోద్యోగులే అందజేయాలని ఎన్నికల కమిషన్ మార్చి 30న ఉత్తర్వులిచ్చింది. సచివాలయ ఉద్యోగులతోనే వికలాంగులు, అనారోగ్యంతో వున్నవారు, వీల్‌ఛైర్‌కు పరిమితమైనవారు వగైరాలకు ఇంటివద్దనే అందజేస్తామని మిగతా వారంతా సచివాలయాలకు వెళ్లి సొమ్ము తీసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. నాలుగేళ్లకు పైగా ఇంటివద్దనే పింఛను పొందుతున్న పేదలు మండుటెండలో సచివాలయాలవద్ద రోజుల తరబడి పడిగాపులు పడవలసిరావడం బాధాకరం. ఆ రెండు పార్టీల ప్రయోజనాల కోసం మంట రాజేసి వికలాంగులు, వృద్ధులు మహిళలను సమిధలు గావించడం దారుణం. గ్రామాల్లో సచివాలయ, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, పట్టణాల్లో మునిసిపల్ ఇంకా ఇతర శాఖల ఉద్యోగులు తగినంత సంఖ్యలో ఉన్నారు. వారికి బాధ్యతనిచ్చి వివిధ ప్రభుత్వ పథకాలు అమలు చేసే స్కీం వర్కర్ల సహాయం తీసుకుంటే లబ్దిదార్ల ఇంటికి వెళ్లి పింఛన్లు ఒక్క రోజులోనే అందజేయవచ్చు. కానీ ప్రభుత్వం అలాగాకుండా కేవలం వికలాంగులు, రోగులకే ఇంటివద్ద పింఛనులనీ మిగతా వారంతా సచివాలయాలకు వెళ్లవలసిందేనని నిర్ణయించింది. దాంతో వృద్ధులు ఎండల్లో కష్టాలు పడడం, కొందరు ఆసుపత్రులపాలు కాగా ఏడుగురు మరణించారు. ఆయా సచివాలయాల పరిధిలో చెల్లించవలసిన సొమ్ము కూడా సంబంధిత ఉద్యోగుల ఖాతాలకు సకాలంలో జమ కాకపోవడం, అయినచోట కూడా అవసరమైనంత కాకుండా కొంత కొరవ పడడం మరిన్ని ఇబ్బందులకు కారణమైంది. మొత్తంగా చూస్తే హైకోర్టు ఉత్తర్వులిచ్చిన వెంటనే తగు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నది స్పష్టం. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదార్ల ఇంటివద్దకు చేర్చడం గ్రామ/ వార్డు సచివాలయ వలంటీర్ల ప్రధాన బాధ్యత.

పథకాలకయ్యే ఖర్చు, వలంటీర్ల పారితోషికం అంతా సర్కారు ఖజానాదే. ప్రభుత్వాన్ని ఏ పార్టీ నడిపినా వలంటీర్ వ్యవస్థ తటస్థంగా, పక్షపాత రహితంగా ఉండాలి. కాని ప్రభుత్వం ఆది నుండీ వారిని రాజకీయ అవసరాల కోసం వాడుకోవడం తగని పని. ప్రభుత్వంలో భాగమైన వలంటీర్ల వ్యవస్థను తటస్థంగా ఉంచేలా ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టడం అవసరం. రెండు ప్రధాన పక్షాలూ వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తా మనే చెబుతున్నాయి కనుక భవిష్యత్తులో అది పటిష్టంగా అమలు కావాలంటే తటస్థ స్వభావం ఒక తప్పనిసరి లక్షణంగా ఉండాలి.

# ఏకంగా 174 శాతం ప్రీమియంతో ఎంట్రీ!



స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేసే వారు ముఖ్యంగా ఐపీఓల కోసం ఎదురుచూస్తుంటారు. ఇవి లిస్టింగ్‌తోనే బంపర్ రిటర్న్స్ ఇస్తుంటాయి. గతేడాది ఆఖర్లో స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లిన నేపథ్యంలో.. పలు ఐపీఓలు ఇన్వెస్టర్లకు మంచి లాభాలు అందించాయని చెప్పొచ్చు. ఇప్పుడు చాలా రోజుల తర్వాత ఒక ఐపీఓ భారీ లాభాలు నమోదు చేసింది. లిస్టింగ్‌తోనే 174 శాతం ప్రీమియం నమోదు చేసి.. మళ్లీ అప్పర్ సర్క్యూట్ కొట్టింది.
మీరు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారా? మరి సరైన స్టాక్స్ ఎంచుకుంటున్నారా? ఇంకా ఆర్థిక నిపుణుల సలహా కూడా తీసుకోవాలి. మార్కెట్లను జాగ్రత్తగా గమనిస్తూ ఒక పద్ధతిలో పెట్టుబడులు పెడుతుండాలి. ఇలా దీర్ఘకాలంలో చాలా స్టాక్స్ మంచి రిటర్న్స్ అందిస్తుంటాయి. ఇంకా స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. వీటిల్లో చాలా వరకు మంచి ప్రీమియంతో స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అవుతుంటాయి. స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి. 100 శాతం నుంచి 250 శాతం వరకు తొలిరోజే పెరగడం విశేషం.

ఇప్పుడు ఇదే బాటలో చాలా రోజులకు మరో ఐపీఓ అదిరిపోయే రిటర్న్స్ లిస్టింగ్‌లోనే నమోదు చేసింది. ఇష్యూ ధర రూ. 106 కాగా.. ఏకంగా 173.58 శాతం ప్రీమియంతో రూ. 290 వద్ద లిస్టయింది. ఇదే టీఏసీ ఇన్ఫోసెక్ స్టాక్. అక్కడితో ఆగలేదు తర్వాత మరో 5 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. దీంతో చివరకు 187 శాతం లాభంతో రూ. 304.50 వద్ద స్థిరపడింది. దిగ్గజ పెట్టుబడిదారుడైన విజయ్ ఖేడియా ఇన్వెస్ట్ చేసిన ఈ ఐపీఓ మార్చి 27 (బుధవారం) సబ్‌స్క్రిప్షన్ కోసం వచ్చింది. ఏప్రిల్ 2న (మంగళవారం) ముగిసింది. ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది. సబ్‌స్క్రిప్షన్ చివరి రోజున ఏకంగా 422.03 రెట్ల స్పందన లభించింది. ఇక ఇది ఎక్స్చేంజీలో లిస్టవగా.. ఒక్కో లాట్ కింద కనీసం 1200 షేర్లు ఓపెన్ చేయాల్సి ఉంటుంది. అంటే దీనికి పెట్టుబడి రూ. 1.27,200 గా ఉంది. ఇక లిస్టింగ్ రిటర్న్స్ చూస్తే 187 శాతానికిపైగా లాభం అంటే ఏకంగా రూ. 2,38 లక్షల మేర లాభం వచ్చింది. మొత్తం పెట్టుబడిని రూ. 3.65 లక్షలు చేసింది. టీఏసీ ఇన్ఫోసెక్ కంపెనీ విషయానికి వస్తే ఇది 2016 లో ప్రారంభమైంది. సైబర్ సెక్యూరిటీ క్వాంటిఫికేషన్, పెనెట్రేషన్ టెస్టింగ్, వెల్నరబులిటీ మేనేజ్‌మెంట్, అసెస్‌మెంట్‌కు సంబంధించి రిస్క్ బేస్డ్ సొల్యూషన్స్ అందిస్తుంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బంధన్ బ్యాంక్, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్, డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇ-గవర్నెన్స్ వంటి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలు, రెగ్యులేటర్లు దీనికి క్లయింట్లుగా ఉన్నాయి.

**స్టాక్ మార్కెట్ లాభనష్టాలతో పెద్దగా సంబంధం లేకుండానే ఐపీఓలు లిస్ట్ అవుతుంటాయి. గతేడాది నవంబర్, డిసెంబర్ సమయంలో టాటా టెక్నాలజీస్, ఐఆర్ఈడీఏ, మోతీసన్స్ జువెల్లర్స్, ఆజాద్ ఇంజినీరింగ్, ఐనాక్స్ ఇండియా వంటి పలు ఐపీఓలు దుమ్మురేపాయి.**

**ముఖ విలువ రూ. 10 గా నిర్ణయించగా.. ఇష్యూ ధర మొదటగా రూ. 100-106 మధ్య నిర్ణయించింది. తర్వాత రూ. 106 ను ఫైనల్ చేసింది.**

# బంగారం ధర ఎప్పుడు తగ్గుతుంది? నిపుణులు ఏమంటున్నారు?

బంగారం ధరలు రోజు రోజు భారీగా పెరుగుతున్నాయి. రెండు రోజుల్లో తులం బంగారం రూ. 1300 పైన పెరిగింది. ప్రస్తుతం గ్రాము గోల్డ్ రేటు 7 వేల పైనే ఉంది. మరి ఈ సమయంలో బంగారం కొనుగోలు చేయడం మంచిదేనా? బంగారాన్ని నగల రూపంలో కొంటే బెటరా లేదా బాండ్స్ రూపంలో కొనడం మంచిదా? బంగారం ధరలు పెరిగేందుకు కారణాలేంటి, ఈ పసిడి ధరలు ఎప్పుడు తగ్గుతాయి? ధరలు తగ్గే వరకు వేచి చూడడం మంచిదేనా? బులియన్ మార్కెట్ నిపుణులు ఏమంటున్నారు అనేది ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. ఇటీవలి కాలంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధర పెరగుదలతో పోలిస్తే.. తగ్గడం చాలా స్వల్పంగా ఉంది. ఆర్థిక అనిశ్చితి, స్టాక్ మార్కెట్లలో ఒడుదొడుకుల వంటి కారణాలతో పెట్టుబడిదారులు బంగారాన్ని భద్రమైన సాధనంగా భావిస్తున్నారు. గోల్డ్ రేట్ల పెరుగుదల వెనుక అంతర్జాతీయ పరిణామాలుఉంటాయి. ప్రపంచ ప్రధాన మార్కెట్లలో లండన్ బులియన్ మార్కెట్ ఒకటి. ధరలను నిర్ణయించేది ఈ మార్కెట్టే. పెద్ద పెద్ద మైనింగ్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు ఈ సంస్థలో ఉన్నారు. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర 2,256 డాలర్ల స్థాయిలో ట్రేడింగ్ అవుతోంది. 2023 నాటి గరిష్ఠ ధరతో పోలిస్తే 8 శాతం ఎక్కువ. భారత కరెన్సీ విలువ సైతం పడిపోవడం గోల్డ్ ధరలు పెరిగేందుకు కారణమవుతోంది. ప్రతి ఏడాది భారత్ కు 800 టన్నుల బంగారం దిగుమతి అవుతుంటుంది.

అమెరికాలో ఆర్థిక సంక్షోభం ధరల పెరుగుదలకు మరో కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.
గత 20 ఏళ్ల కాలాన్ని గమనించినట్లయితే బంగారం ధరలు క్రమం తప్పకుండా పెరుగుతున్నాయి. దీనికి కారణం దాని డిమాండ్ పెరగడమే. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు, ఎన్నికల వాతావరణం, డొనాల్డ్ ట్రంప్ గెలిచే అవకాశాలు ఉన్నాయన్న ఊహాగానాలు, రాజకీయ పరమైన మార్పులు సైతం బంగారం పెరిగేందుకు కారణమవుతున్నాయి. బంగారం ధర ఎప్పుడు తగ్గొచ్చు? బంగారం ధరల పెరుగుదల 2025 వరకు కొనసాగే అవకాశం ఉందని జేపీ మోర్గాన్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థలు అంచనా వేస్తున్నాయి. అంటే ఈ ఏడాదంతా ధరలు పెరిగే అవకాశాలే ఉన్నాయని అర్థమవుతోంది. వచ్చే ఏడాదిలో కాస్త ఊరట లభించవచ్చు. బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్న క్రమంలో పసిడిపై పెట్టుబడి పెడితే మంచి రాబడి వచ్చే అవకాశం ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అయితే, నగలు లేదా బంగారు నాణాలు కొనుగోలు చేస్తే మొత్తం ధరలో తరుగు కమిషన్ కింద 20 శాతం పోతుంది. అంటే మీరు రూ.100 పెట్టి బంగారం కొంటే దాని అసలు విలువ రూ.80 మాత్రమే. అదే గోల్డ్ బాండ్ కొనుగోలు చేస్తే నెల నెలా వడ్డీ వస్తుంది. బాండ్స్ పోతాయనే భయం ఉండదు. డిజిటల్ గోల్డ్ ద్వారా 4 కిలోల వరకు కొనుగోలు చేయవచ్చు. వాటిపై పన్ను మినహాయింపులు సైతం లభిస్తాయి.

# అదరగొట్టిన హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు.. వరుసగా 7వ రోజు లాభాలే..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు తమ ఇన్వెస్టర్లపై కాసులు కురిపిస్తున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాపడ్డాయి. గత వారం రోజుల్లో 6 శాతానికిపైగా పెరిగాయి. నష్టాల నుంచి ఇక తేరుకున్నట్లేనా? ఇప్పుడు షేర్లు పెరిగేందుకు గల కారణాలేంటి? ఓసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు అదరగొడుతున్నాయి. వరుసగా ఏడవ సెషన్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏప్రిల్ 5వ తేదీన ఈ బ్యాంక్ స్టాక్ 1.5 శాతం మేర లాభంతో ట్రేడింగ్ అవుతోంది. ఈ వార్త రాసే సమయానికి దేశీయ అతిపెద్ద బ్యాంక్ షేర్లు 1.55 శాతం లాభంతో రూ.1551.65 వద్ద కొనసాగుతున్నాయి. అంతకు ముందు రోజు సెషన్‌లో ఈ షేర్లు 3 శాతం మేర లాభపడిన సంగతి తెలిసిందే. అలాగే గత 5 ట్రేడింగ్ సెషన్లలో చూసుకుంటే ఈ బ్యాంక్ షేర్లు సుమారు 6 శాతం మేర లాభపడ్డాయి. అలాగే గత ఏడు వరుస సెషన్లో 8 శాతం మేర పెరిగాయి. మరోవైపు.. గత ఆర్థిక సంవత్సరం 2023-24లో మూడో




త్రైమాసిక ఫలితాల ప్రకటన అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయి. ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చాయి. అయితే, మళ్లీ క్యూ4 ఫలితాలపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ అందుతున్న క్రమంలోషేర్లు రాణిస్తుడడం గమనార్హం. ఈ క్రమంలోనే షేర్లపై పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఇచ్చాయి జెఫ్ఫెరీస్ అండ్ మక్వారీ వంటి చాలా బ్రోకరేజీ సంస్థలు. దీంతో మదుపరులు ఈ షేర్లు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, వరుస సెషన్లలో లాభాల్లో కొనసాగుతున్న క్రమంలో ఇక ముందు ముందు అదే ట్రెండ్ కొనసాగుతందని చెప్పేందుకు లేదు. ఏప్రిల్ 20వ తేదీన క్యూ4 ఫలితాలు ప్రకటించనుంది. ఆ తర్వాత స్టాక్ ఇదే పాజిటివ్ ట్రెండ్‌లో కొనసాగకపోవచ్చని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి 1757.50 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్తాయి 1363. 55 వద్ద ఉంది. ఈ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.11.77 లక్షల కోట్లుగా ఉంది. పీఈ రేషియో 17.35 శాతం, డివిడెండ్ యీల్డ్ 1.23 శాతంగా ఉన్నాయి.

# లక్ష పెడితే రూ.15 లక్షలు..

ప్రముఖ లాజిస్టిక్ కంపెనీ స్టాక్ అదరగొట్టింది. గత వారం రోజులుగా వరుసగా అప్పర్ సర్క్యూట్‌లో లాక్ అవుతోంది. ఇన్వెస్టర్లకు కాసులు కురిపిస్తోంది. అంతే కాదు గత మూడేళ్లలోనే 1500 శాతం పెరిగి లక్ష పెట్టుబడికి రూ.15 లక్షలు లాభాలు అందించింది. అదే టైగర్ లాజిస్టిక్స్ ఇండియా కంపెనీ స్టాక్. గడిచిన ఆరు సెషన్లలో ప్రముఖ లాజిస్టిక్స్ కంపెనీ అయిన టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ స్టాక్ అదరగొట్టింది. వరుస సెషన్లలో అప్పర్ సర్క్యూట్ కొడుతోంది. అలాగే గత మూడేళ్లలో 1500 శాతం పెరిగి మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించింది. లక్ష రూపాయలకు రూ. 15 లక్షలు లాభాలు ఇచ్చింది. భారతీయ స్టాక్ మార్కెట్ల లో ఇటీవలి కాలంలో మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించిన స్టాక్స్ లో ఒకటిగా నిలిచింది. మార్చి 28, 2024 నుంచి వరుస సెషన్లలో ఈ స్టాక్ అప్పర్ సర్క్యూట్ కొడుతూ వస్తోంది. ఏప్రిల్ 5 వ తేదీ శుక్రవారం నాటి ట్రేడింగ్ చూసుకుంటే మార్కెట్లు ప్రారంభమైన కొద్ది సేపటికే బీఎస్ఈలో ఇంట్రాడే హై వాల్యూ రూ. 58.69 స్థాయిని తాకింది.
కొద్ది సేపటికే 5 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్ లో లాక్ అయింది. సుమారు రూ. 5.65 కోట్ల సర్వీస్ ట్యాక్స్ సంబంధించి కంపెనీకి అనుకూలంగా నిర్ణయం వెలువడినట్లు తెలిసిన క్రమంలో ఈ షేర్లు రాణిస్తున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్చేంజీ ఫైలింగ్ లో సర్వీస్ ట్యాక్స్ గురించి వెల్లడించింది కంపెనీ. 2023, జులై 14, 2022 ఫిబ్రవరి 10 న సర్వీస్ ట్యాక్స్ డిమాండ్ నోటీసులు వచ్చాయని, ఇప్పుడు వాటికిసంబంధించిన నోటీసులపై అనుకూల నిర్ణయం వెలువడినట్లు తెలిపింది. రూ. 5.65 కోట్లలో రూ. 2.64 కోట్ల ట్యాక్స్ ఇప్పటికే చెల్లించినట్లు ట్యాక్స్ విభాగం తేల్చిందని పేర్కొంది. ఈ వార్త రాసే సమయానికి టైగర్ లాజిస్టిక్స్ ఇండియా లిమిటెడ్ షేరు 5 శాతం లాభంతో రూ. 58.69 వద్ద ట్రేడింగ్ అవుతోంది. గత 5 రోజుల్లోనే 21 శాతానికిపైగా పెరిగింది. ఈ కంపెనీ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి రూ. 87 వద్ద ఉండగా.. 52 వారాల కనిష్ఠ స్థాయి రూ. 33.75 వద్ద ఉంది. అలాగే కంపెనీ మార్కెట్ విలువ రూ.620 కోట్లుగా ఉంది. పీఈ రేషియో 51. 76 వద్ద ఉంది. ఈ స్టాక్ గత ఏడాది కాలంలో 56 శాతం లాభపడింది. అయితే, మూడేళ్లలో 1500 శాతం మేర పెరిగింది. అంటే మూడేళ్ల క్రితం లక్ష పెట్టుబడి పెట్టిన వారికి ఇప్పుడు ఆ షేర్ విలువ రూ. 16 లక్షలకుపైగా ఉంటుంది. మూడేళ్లలోనే లక్షకు రూ. 15 లక్షలు లాభాలు వచ్చినట్లయింది.

# భారతీయులకు శుభవార్త చెప్పిన జపాన్..

విదేశీ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించి, ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా జపాన్.. తన వీసా విధానంలో మార్పులు చేసింది. పర్యాటకుల కోసం ప్రత్యేకంగా ఈ-వీసాను ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా చాలా ఈజీగా వీసాలను పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద భారతీయులు సహా పలు దేశాల పౌరులకు వీసా అందజేస్తోంది. ఈ కార్యక్రమం 90 రోజుల వరకు పర్యాటక ప్రయోజనాల కోసం జపాన్‌కు ప్రయాణించాలనుకునే వారికి ఒకే ప్రవేశ స్వల్పకాలిక వీసాను అందిస్తుంది.
అమెజాన్ సమ్మర్ స్పెషల్ ఎ స్ప్లిట్ ఇన్వర్టర్ ఏసీల ప్రారంభ ధర రూ. 25,990 మాత్రమే! ఎక్స్చేంజి డిస్కౌంట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. భారతీయుల సహా వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా జపాన్ 'ఈ-వీసా'ను ప్రారంభించింది. పాస్‌పోర్టులలో భౌతిక స్టిక్కర్ల అవసరం లేకుండా ఈ కొత్త విధానాన్ని జపాన్ తీసుకొచ్చింది. ఏప్రిల్ 1, 2024 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ఈ కొత్త విధానం ద్వారా భారతీయ పర్యాటకులు ఆన్‌లైన్‌లోనే వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వీఎఫ్ఎస్ గ్లోబల్ ద్వారా నిర్వహిస్తున్న జపాన్ వీసా అప్లికేషన్ సెంటర్లలో దరఖాస్తు



చేసుకునే వెసులుబాటు కల్పించింది. పర్యాటకుల సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో వీసా పొందినవారు జపాన్‌లో గరిష్ఠంగా 90 రోజులు ఉండటానికి అనుమతిస్తుంది. అయితే జపాన్‌లో ఎంట్రీకి మాత్రం ఒకే ఒక్కసారి అనుమతి ఉంటుంది. భారతీయులతో పాటు ఇండియాలో నివసిస్తున్న విదేశీయులు కూడా ఈ-వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆస్ట్రేలియా, బ్రెజిల్, కాంబోడియా, కెనడా, సౌదీ అరేబియా, సింగ్‌పూర్, దక్షిణాఫ్రికా, తైవాన్, యూఏఈ, యూకే, అమెరికాకు చెందిన పర్యాటకులకు కూడా ఎలక్ట్రానిక్ వీసాకు అర్హులే. ఈ దేశాలు లేదా ప్రాంతాల నివాసితులు, స్వల్పకాలిక వీసాల నుంచి మినహాయింపు పొందినవారు జపాన్ ఈ-వీసా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు విధానం... జపాన్ వీసా అధికారిక వెబ్‌సైట్ దరఖాస్తు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను పొందుపరచాలి. ఫొటోలతో సహా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలి. దరఖాస్తును సమర్పించడానికి తేదీని ముందుగా బుక్ చేసుకుంటే ఫీజు వివరాలు సహా అపాయింట్‌మెంట్ లెటర్‌తో కూడిన ఈ-మెయిల్ వస్తుంది. దరఖాస్తును అందజేసి.. నిర్ణయం కోసం వేచిచూడాల్సి ఉంటుంది. వీసా అప్లికేషన్ స్టేటస్‌ని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. విజయవంతంగా ఎంపికైన దరఖాస్తుదారులకు ఎలక్ట్రానిక్ వీసా మంజూరు అవుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, భౌతిక వీసా స్టిక్కర్‌లను జారీ చేయడం జరగదు. ప్రయాణ సమయంలో ఎయిర్‌పోర్టుల వద్ద చెక్-ఇన్ సమయంలో తమ డివైజ్‌లలోని వీసా చూపించాల్సి ఉంటుంది. ఈ-వీసాపై ఉన్న డిస్‌ప్లే ఆప్షన్ మీద క్లిక్ చేస్తే సరిపోతుంది.

# ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్నిప్రమాదం..

ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కంపెనీలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. ఆ మంటలు క్రమంగా ఇతర ట్రాన్స్‌ఫార్మర్లకు వ్యాపించాయి. దీంతో భారీ ప్రమాదం జరిగింది. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. రాజధాని రాయ్‌పూర్‌లోని కోటా ప్రాంతంలో ఉన్న ఓ



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీలో ఫైర్ యాక్సిడెంట్ చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫారం పేలడంతో ఒక్కసారిగా భారీగా శబ్దంతోపాటు మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మంటలు కాస్తా.. పక్కనే ఉన్న మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు అంటుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇక సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి.. ఫైర్ సిబ్బంది.. ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మంటలు వ్యాపించడంతో భారీ ఎత్తున మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కూడా అలుముకుంది. వీలైనంత త్వరగా మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇక ట్రాన్స్‌ఫార్మర్ల పేలిన ఘటన జరిగిన సమయంలో కంపెనీలో కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అందులో ఎందరు కార్మికులు ఉన్నారనేది అధికారులు ఆరా తీస్తున్నారు. వారి పరిస్థితి ఎలా ఉంది.. ఎవరైనా చనిపోయారా.. ఎవరికైనా గాయాలు అయ్యాయా అనే విషయాల గురించి ఇంకా ఎలాంటి సమాచారం అందించలేదు. ఇక ఈ ఘటనలో ఎంత ఆస్తి నష్టం సంభవించిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.

# బర్త్ సర్టిఫికెట్‌లో తల్లిదండ్రుల మతం విడిగా నమోదు

గతేడాది పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జనన మరణ నమోదు చట్టానికి కేంద్ర ప్రభుత్వ సవరణలు చేసి.. బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందింది. అనంతరం రాష్ట్రపతి సంతకంతో ఇది చట్టంగా మారింది. ఈ చట్టంపై గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కేంద్రం.. అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు తెలిపింది. అయితే, ఇందులోని నిబంధనలకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాస్తవానికి చట్టం అమలుకు రాష్ట్రాల సమ్మతి తప్పనిసరి. ఇకపై జనన ధ్రువీకరణ పత్రాల్లో తల్లిదండ్రులు తమ మతం గురించి వ్యక్తిగతంగా నమోదుచేయాల్సి ఉంటుంది. గతంలో ఉన్న 'కుటుంబ మతం' స్థానంలో తల్లి, తండ్రి విడిగా తమ మతం గురించి డిక్లరేషన్ ఇవ్వాలి. ఈ కొత్త నిబంధన కేంద్ర హోంశాఖ నమూనా నిబంధనలకు అనుగుణంగా ఉంది. అయితే, ఇది అమల్లోకి వచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసి, వాటి ఆమోదం తప్పనిసరి. దత్తత తీసుకునే తల్లిదండ్రుల కూడా మతాన్ని వ్యక్తిగతంగా నమోదు చేయాలి. జనన, మరణాల నమోదుకు జాతీయ స్థాయి డేటాబేస్ ఏర్పాటు చేయనున్నారు. ఆధార్ నంబర్లు, ఆస్తి రిజిస్ట్రేషన్లు, రేషన్ కార్డులు, ఎలక్టోరల్ రోల్స్, పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్‌తో సహా అనేక ఇతర డేటాబేస్‌లను రిఫ్రెష్ చేయడానికి దీనిని సమర్థంగా ఉపయోగించనున్నారు. గత, వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో జనన మరణ నమోదు (సవరణ) చట్టం బిల్లు 2023కు ఉభయసభలు ఆమోదం తెలిపాయి. ఆగస్టు 1న లోక్‌సభలోనూ, 7న రాజ్యసభ లోనూ ఆమోదించారు. అక్టోబర్ 2023 నుంచి విద్యా సంస్థలలో ప్రవేశం, డ్రైవింగ్ లైసెన్స్, ఓటు హక్కు, ఆధార్ నంబర్‌ను పొందడం, వివాహాలను నమోదు, ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందడం వంటి వివిధ ముఖ్యమైన సేవలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. 'జననాలు, మరణాల డేటాబేస్ రూపొందించడంలో ఇది సహాయపడుతుంది. ప్రజా సేవలు, సామాజిక ప్రయోజనాలు, డిజిటల్ రిజిస్ట్రేషన్‌లో సమర్థవంతమైన, పారదర్శకతకు సహకరిస్తుంది'అని హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 'జనన మరణాల నమోదు (సవరణ) చట్టం, 2023 (20 ఆఫ్ 2023)లోని సెక్షన్ 1లోని సబ్-సెక్షన్ (2) ద్వారా దఖలుపడిన అధికారాలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 1 నుంచి చట్టంలోని నిబంధనలు అమల్లోకి వస్తాయని' అని నోటిఫికేషన్ పేర్కొంది.

# ప్రపంచ క్యాన్సర్ రాజధానిగా భారత్..



ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న కేన్సర్ మరణాల్లో దాదాపు సగం ధూమపానం, మద్యం సేవించడం, అధికబరువు వంటి కారణాలే కారణమని పలు అధ్యయనాల్లో వెల్లడయ్యింది. ఇక, దేశంలో కేన్సర్ భారినపడుతోన్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగతూ ఉండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న వయసు పిల్లలు సైతం దీని బారిపడుతున్నారు. నిన్న మొన్నటి వరకూ ఏడాదికి 40 వేల నుంచి 50 వేల మంది చిన్నారులు మహమ్మారి బారిన పడేవారు.
కేన్సర్ వ్యాధిపై ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఏటా లక్షల మందిని ఈ మహమ్మారి బలితీసుకుంటోంది. ఇక, భారత్ కేన్సర్‌కు రాజధానిగా మారిపోయిందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. కేన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ), హృద్రోగం, మానసిక సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధులు తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా కేన్సర్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ప్రపంచ కేన్సర్ రాజధానిగా భారత్ తయారైందా? అన్న స్థాయిలో పరిస్థితి ఉందని పేర్కొంది. 'హెల్త్ ఆఫ్ ది నేషన్' పేరుతో అపోలో హాస్పిటల్స్ గురువారం విడుదల చేసిన నాలుగో వార్షిక నివేదికలో పలు సంచలన విషయాలు ఉన్నాయి. చిన్నపిల్లలు పలు అసాంక్రమిక వ్యాధుల బారినపడటం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, దీనిని నివారించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని నివేదిక సూచించింది. కేన్సర్ విషయంలో కూడా ఇది కనిపిస్తోందని, ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో ఈ వ్యాధి బారినపడుతున్న వారి సగటు వయసు చాలా తక్కువగా ఉంటోందని వివరించింది. దేశంలో రొమ్ము, గర్భాశయం, ఊపిరితిత్తులు, నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతునప్పటికీ, నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం చాలా తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. అలాగే, స్థూలకాయం (ఒబిసిటీ) కూడా భారతీయ యువతలో పెరిగిపోతోందని, ఇది పలు అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతోందని తెలిపింది.
అంతేకాదు, మధుమేహం, హైపర్ టెన్షన్ (బీపీ)ల ముప్పును పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారని వెల్లడయ్యింది. యువతలో మానసిక సమస్యలు ముఖ్యంగా కుంగుబాటు (డిప్రెషన్) అధికంగా కనిపిస్తోందని తేలింది. ఈ నివేదికపై అపోలో హాస్పిటల్స్ వైస్-ఛైర్మన్ డాక్టర్ ప్రీతా రెడ్డి మాట్లాడుతూ.. అసాంక్రమిక వ్యాధులను ఎదుర్కోవటానికి తక్షణం సమష్టి కార్యాచరణ అవసరమని అన్నారు. ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు వ్యక్తిగత స్థాయిలో చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఆవశ్యకత ఉందని చెప్పారు.
వైద్య చికిత్సలకు సంబంధించి మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని, వాటిని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని అపోలో సంస్థల ఛైర్మన్, సీఈఓ డాక్టర్ మధు శశిధర్ సూచించారు. ఈ మేరకు అపోలో 'ప్రో హెల్త్ స్కోర్' పేరుతో దేశంలోనే తొలి డిజిటల్ హెల్త్ కౌంటింగ్ టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా తమ ఆరోగ్యం పై స్వీయ అంచనాకు వచ్చి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఓ ప్రకటనలో తెలిపింది. అసాంక్రమిక వ్యాధులు దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.లక్షల కోట్ల మేర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో.. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ టూల్ ఎంతో ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
ఆదివారం 07 ఏప్రిల్ 2024

# కొత్త రిలీజ్ డేట్ ఇదేనా?



ప్రభాస్ నాగ్ అశ్విన్ కాంబోలో రాబోతోన్న కల్కి 2898 ఏడీ మూవీ గురించి వచ్చే ప్రతీ అప్డేట్ ఎంతగా వైరల్ అవుతుంటుందో అందరికీ తెలిసిందే. ఈ మూవీలో దీపిక పదుకొణె, అమితాబ్, కమల్ హాసన్ వంటి వారంతా నటించారు. ఈ మూవీని ముందుగా మే 9న విడుదల చేయాలని భావించారు. కానీ ఎన్నికల సందర్భంగా ఈ చిత్రాన్ని వాయిదా వేయాలని అనుకుంటున్నారట. ప్రభాస్, దీపిక పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి భారీ తారాగణంతో నాగ్ అశ్విన్ కల్కి 2898 ఏడీ సినిమాను సిన సంగతి తెలిసిందే. అశ్వనీదత్ భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మించాడు. తనకు లక్కీ డేట్‌గా ఉండే మే 9న ఈ మూవీని విడుదల చేయాలని అనుకున్నాడు. కానీ ఎన్ని కలు వచ్చి పడటంతో సినిమాను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇంత వరకు సినిమాను వాయిదా వేయబోతోన్నామని మాత్రం అధికారికంగా ప్రకటించలేదు. కానీ తప్పకుండా పోస్ట్ పోన్ అవుతుందని మాత్రం అంతా అనుకుంటున్నా రు. మే 9న జగదేక వీరుడు అతిలోక సుందరి, మహానటి వంటి చిత్రాలను రిలీజ్ చేసి బ్లాక్ బస్టర్ హిట్లు కొట్టాడు. ఇక తమకు కలిసి వచ్చే ఆ డేట్‌నే కల్కి సినిమాకు ఎంచుకున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ కే సినిమాకు ఎన్నికలు అడ్డం పడ్డాయి. మే అంతా కూడా ఎన్నికల హడావిడే ఉంది. అందుకే ఈ సినిమాను వాయిదా వేయాలని అనుకుంటున్నారట. అయితే మరీ ఎక్కువ రోజులు వాయిదా వేయడం కూడా మంచిది కాదనే ఉద్దేశంలో యూనిట్ ఉందట. అందుకే మే 30న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఈ మేరకు నెట్టింట్లో ఈ కొత్త రిలీజ్ డేట్ చక్కర్లు కొడుతోంది. మరి చిత్రయూనిట్ నుంచి అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి. ఏది ఏమైనా ఈ మూవీతో వరల్డ్ వైడ్‌గా ప్రభాస్ సత్తాను నాగ్ అశ్విన్ చాట బోతోన్నాడు. ఈ మూవీ మహా భారతం పీరియడ్ నుంచి మొదలుకొని 2898 సంవత్సరం వరకు సాగుతుందని తెలుస్తోంది. మైథాలజీ, టైం ట్రావెల్ కథ అంటూ ప్రాజెక్ట్ కే మీద ఎన్ని వార్తలు వచ్చాయో అందరికీ తెలిసిందే.

# కొత్త జోడీ దొరికింది!





తేజకు జోడీగా రితికా నటించబోతుందని సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్‌లో ఈమెకు మంచి గుర్తింపు దక్కింది. టాలీవుడ్‌లో మొదటి సూపర్ హీరో కాన్సెప్ట్‌తో వచ్చిన హనుమాన్ సినిమాతో తేజ సజ్జా భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. సంక్రాంతి కానుకగా వచ్చిన హనుమాన్ టాలీవుడ్ ఇండస్ట్రీలో భారీ విజయాలు సాధించిన సినిమాల జాబితాలో చేరి పోయింది. హనుమాన్‌కి సీక్వెల్ కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఆ గ్యాప్‌లో తేజ సజ్జా ఓ భారీ కమర్షియల్ ఎంటర్ టైనర్ ను చేసేందుకు సిద్ధం అయ్యాడు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో తేజ సజ్జా హీరోగా నటించబోతున్న ట్లుగా ఇప్పటికే క్లారిటీ వచ్చింది.అదే సినిమాలో మరో హీరోగా మంచు మనోజ్ నటించబోతున్నాడు. ఇద్దరు హీరోలు కలిసి నటించబోతున్న భారీ మల్టీ స్టారర్ మూవీ లో హాయ్ నాన్న మూవీలో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ రితికా నాయక్ ను ఒక హీరోయిన్‌గా ఎంపిక చేయడం జరిగింది. తేజ కు జోడీగా రితికా నటించబోతుందని సమాచారం అందుతోంది. ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఈమెకు మంచి గుర్తింపు దక్కింది. హాయ్ నాన్నకు ముందు అశోక వనంలో అర్జున కళ్యాణం సినిమాలో కూడా హీరోయిన్‌గా నటించిన రితికా నటించి మెప్పించింది. రితికా తెలుగులో ముందు ముందు భారీ సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. అందంతో పాటు నటనతో అలరించే సత్తా ఈ అమ్మడి సొంతం. అందుకే తేజతో నటించబోతున్న ఈ సినిమా హిట్ అయితే ముందు ముందు స్టార్ హీరోలకు జోడీ కట్టే అవకాశాలు ఉన్నాయి. మొత్తానికి మన సూపర్ హీరో తేజకి కొత్త జోడీ దొరికింది.

# ఇదొక సంచలనం

పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ది గోట్ లైఫ్ మూవీ ఇప్పుడు మాలీవుడ్‌లో సంచలనంగా మారింది. తెలుగులోనూ ఈ మూవీకి మంచి ప్రశంసలు వచ్చాయి. కానీ ఇలాంటి సినిమాలు థియేటర్లు తెలుగు ఆడియెన్స్ అంతగా ఆదరించరన్న సంగతి తెలిసిందే. కానీ మాలీవుడ్‌లో మాత్రం ఈ మూవీ రికార్డులు క్రియేట్ చేస్తోంది. మలయాళంలో ప్రస్తుతం వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లు వస్తున్నాయి. ప్రేమలు, మంజుమ్మల్ బాయ్స్ ఆల్రెడీ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి. వంద, రెండు వందల కోట్ల క్లబ్బులో జాయిన్ అయ్యాయి. అలా ఇప్పుడు స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా కూడా రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఈ మూవీ గత నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విడుదలైన సంగతి తెలిసిందే. తెలుగులో ఈ సినిమాను మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీకి తెలుగులో మంచి ప్రశంసలు దక్కాయి. అయితే ఇక్కడ మాత్రం కలెక్షన్లు చెప్పుకునే రేంజ్‌లో అయితే రావడం లేదు. కానీ "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా 9 రోజుల్లో వరల్డ్ వైడ్ గా 100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్ట్ చేసి రికార్డులు క్రియేట్ చేసింది. వరల్డ్ వైడ్ గా 1720 స్క్రీన్స్ లో "ది గోట్ లైఫ్" (ఆడు జీవితం) సినిమా రన్ అవుతోన్న సంగతి తెలిసిందే. మాలీవుడ్‌లో వంద కోట్లు కొల్లగొట్టడం అంటే ఇండస్ట్రీ హిట్లు అన్న మాటే. ఈ ఏడాది వరుసగా అక్కడి మేకర్లు హిట్ల మీద హిట్లు కొడుతున్నారు. పృథ్వీరాజ్ సినిమాలకు అక్కడ మంచి గిరాకీ ఉంటుంది. ఇక ఈ మూవీ ఇప్పుడు సక్సెస్ ఫుల్ గా ఫస్ట్ వీక్ కంప్లీట్ చేసుకుని రెండో వారంలోకి అడుగుపెట్టింది. రెండో వారంలోనూ బాక్సాఫీస్ వద్ద మంచి ఆదరణ పొందుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించిన విషయం విధితమే. విజువల్ రొమాన్స్ బ్యానర్ ఈ సినిమాను మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ గా భారీ బడ్జెట్ తో నిర్మించింది. 90వ దశకంలో జీవనోపాధి వెతుక్కుంటూ కేరళను వదిలి విదేశాలకు వలస వెళ్లిన నజీబ్ అనే యువకుడి జీవిత కథను వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ తో పాటు హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, అమలాపాల్, కేఆర్ గోకుల్, అరబ్ ఫేమస్ యాక్టర్స్ తాలిబ్ అల్ బలూషి, రిక్ ఆబే ఇతర కీలక పాత్రల్లో నటించారు.



# అభిమాని కోసం సక్సెస్ మీట్‌కి 'దేవర'!



ఇప్పుడు ఎన్టీఆర్ తనపై ఇంతటి అభిమానం కనబరుస్తున్న సిద్దు జొన్నలగడ్డ కోసం సక్సెస్ మీట్ లో పాల్గొనెందుకు సిద్ధం అయ్యాడు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నాడు. త్వరలోనే దేవర సినిమా షూటింగ్‌ను ముగించి వార్ 2 సినిమా షూటింగ్‌కి జాయిన్ అవ్వాలని ఎన్టీఆర్ భావిస్తున్నాడు. ఇలాంటి సమయంలో కూడా తన అనుకున్న వారికి, తనను అభిమానించే వారికి కావాల్సినంత సమయంను ఎన్టీఆర్ ఇస్తూనే ఉంటారు. తాజాగా విశ్వక్ సేన్ మరియు సిద్దు జొన్నలగడ్డ ను కలిసిన విషయం తెల్సిందే. ఇద్దరికి కూడా ఎన్టీఆర్ అంటే చాలా అభిమానం. ఆ విషయాన్ని చాలా సందర్భాల్లో వారు చెప్పుకొచ్చారు. అలా తమ అభిమాన నటుడిని నిర్మాత నాగ వంశీతో కలిసి విశ్వక్ సేన్ మరియు సిద్దు లు కలిసి కొద్ది సమయం సరదాగా గడిపారు. ఫ్యాన్ బాయ్ మూమెంట్ అంటూ ఫోటోలు కూడా షేర్ చేసిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఎన్టీఆర్ తనపై ఇంతటి అభిమానం కనబరుస్తున్న సిద్దు జొన్నలగడ్డ కోసం సక్సెస్ మీట్‌లో పాల్గొనెందుకు సిద్ధం అయ్యాడు. టిల్లు స్క్వేర్ సక్సెస్ మీట్ లో ఎన్టీఆర్ పాల్గొనబోతున్నా డు. సిద్దు జొన్నలగడ్డ హీరోగా అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్‌లో రూపొంది ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన టిల్లు స్క్వేర్ మూవీ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. 8 రోజుల్లో దాదాపుగా వంద కోట్ల రూపాయల వసూళ్లు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమాకు భారీ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకు న్నారు. ఆ సక్సెస్ మీట్‌కు ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరు అవ్వబోతున్నాడు. సిద్దు కు తనపై ఉన్న అభిమానం కోసం దేవర ఈ మీట్ కు వచ్చేందుకు ఓకే చెప్పి ఉంటాడు.



# అన్ని కోట్లు ఇస్తున్నారా?

అవును అక్షరాల 10 కోట్లకు పైగానే పారితోషికం తీసుకుంటుందిట. దక్షిణాది పారితోషికంతో పొల్చితే అక్కడ రెట్టింపు అందుకుంటుందని తెలుస్తోంది. నేచురల్ పెర్ఫార్మర్ సాయిపల్లవి ఎంతటి ప్రతిభావంతురాలన్నది చెప్పాల్సిన పనిలేదు. కటౌట్ కాకపోయినా తనలో ఉన్న కంటెంట్ తో రాణిస్తోన్న నటి ఆమె. అందుకే ఎంత మంది కొత్త భామలొచ్చినా ఆమెకి పోటీ కాదనే చెప్పాలి. నెంబవర్ వన్ రేసులో ఎంతమంది హీరోయిన్లు ఉన్నా! సాయి పల్లవికంటూ ప్రత్యేకమైన ట్రాక్ వేసుకుని ముందు కెళ్తుంది. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుంది. కేవలం డీసెంట్ పాత్రల మాత్రమే చేస్తుంది. అందులోనూ నటనకు ఆస్కారం ఉండాలి. ఇలా తనకంటూ కొన్ని నియమ నిబంధనలున్నాయి. ఆ ప్రకారం ముందుకెళ్తుంది. అందుకు తగ్గ అవకాశాలే అమ్మడు అందుకుంటుంది. ఇక్కడ ఆమె ఒక్కో సినిమాని నాలుగు నుంచి ఐదు కోట్లు పారితోషికం అందుకుంటుంది. నిర్మాతల్ని అధికంగా డిమాండ చేస్తోందనిగానీ.... అదనపు భారాలు మోపుతుందని గానీ ఏ నాడు తెరపైకి వచ్చింది లేదు. ఎందుకంటే అమ్మడు ఇండస్ట్రీలో కొన్ని ఎథిక్స్ తో ముందుకెళ్లుంది. ఎంతో డౌన్ ఎర్త్ ఉంటుంది. తాను హీరోయిన్ అనే ఫీల్‌ని పక్కనబెట్టి అందరితో కలిసి పోయే మనస్థత్వం గలది. ఆ రకమైన లక్షణం కూడా పల్లవిని తెలుగు ఆడియన్స్ ని మరింత దగ్గర చేసింది. ప్రస్తుతం సాయి పల్లవి బాలీవుడ్ లో 'రామాయణ్'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో సీత పాత్రలో నటిస్తోంది. మరి ఈ సినిమాకి అమ్మడు తీసుకునే పారితోషికం ఎంతో తెలిస్తే స్టన్ అవ్వడం ఖాయం. అవును అక్షరాల 10 కోట్లకు పైగానే పారితోషికం తీసుకుంటుందిట. దక్షిణాది పారితోషికంతో పొల్చితే అక్కడ రెట్టింపు అందుకుంటుందని తెలుస్తోంది. మరి డిమాండ్ చేయని హీరోయిన్‌కి అంత ఎందుకు ఇస్తారు? అంటే ఇక్కడ తన మార్కెట్‌ని బాలీవుడ్ పెంచినట్లు సమాచారం. ఇన్ని కోట్లు ఇవ్వండని సాయిపల్లవి అడగలేదుట. తన ప్రతిభని... ఫాలోయింగ్‌ని చూసి దర్శక-నిర్మాతలు ఆమాత్రం చేయాలని నిర్ణయించి ఇచ్చినట్లు ఇన్ సైడ్ టాక్ వినిపిస్తుంది.

# వైట్ అండ్ వైట్‌లో హాట్ బ్యూటీ!



తెలుగమ్మాయి శోభిత దూళిపాళ సక్సెస్ గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ టూ హాలీవుడ్ వయా టాలీవుడ్ మీదగా దూసుకెళ్లిన బ్యూటీ. తెలుగమ్మాయి శోభిత దూళిపాళ సక్సెస్ గురించి చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ టూ హాలీవుడ్ వయా టాలీవుడ్ మీదగా దూసుకెళ్లిన బ్యూటీ. ఓ తెలుగు నటి ఇంగ్లీష్ సినిమా చేయడం అన్నది నిజంగా ప్రశంసించదగ్గ విషయం. ఎంతో మంది తెలుగు భామలున్నా! ఎవరికీ సాధ్యం కానిది శోభిత సాధ్యం చేసి చూపించింది. సినిమా ఛాన్స్ అనేది ఇండియాలో ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. సొంత భాషలో యాచిస్తేగానీ అవకాశాలు రావు. అలాంటిది ఏకంగా భాషకానీ భాషలో..దేశం కానీ దేశంలో వరల్డ్ లోనే ఫేమస్ అయ్యే హాలీవుడ్‌లో అవకాశం అందుకుని షెభాష్ అనిపించింది శోభిత. ఆమె హాలీవుడ్‌లో మంకీ మ్యాన్ అనే సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 5న ఆ చిత్రం రిలీజ్ అయింది. ఫ్యాన్స్‌కు అనసూయ సూపర్ ట్రీట్ ఇక బ్యూటీ సినిమా ప్రమోషన్ కోసం రకరకాల కార్యక్రమాల్లో పాల్గొంది. తాజాగా అలాంటి ఈవెంట్ కి సంబంధించిన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. లాస్ ఏంజిల్స్‌లోని చారిత్రాత్మక చైనీస్ థియేటర్‌లో మంకీ మ్యాన్‌రెడ్ కార్పెట్‌పై హొయలు పోయేందుకు అమ్మడు ఇలా ముస్తాబైంది. వైట్ కలర్ డిజైనర్ దుస్తుల్లో అమ్మడు చెమల పిల్లి బ్యూటీని తలపిస్తుంది. వైట్ అండ్ వైట్‌లో శోభిత అందంగా కనిపిస్తుంది. అమ్మడి హెయిర్ స్టైల్..మ్యాకప్....చెవులీలు ప్రతీది ప్రత్యేకంగా ఫోకస్ చేసాయి. రెడ్ కార్పెట్ పై నడిచముందు క్యాప్చర్ చేసిన పిక్ ఇది.

# ఉపాసన బాటలో...



రకుల్ ప్రీత్ ప్రస్తుతం తెలుగులో అంతగా కనిపించడం లేదు. టాలీవుడ్‌లో రకుల్‌కు ఎక్కువగా ఆఫర్లు కూడా రావడం లేదు. ఆమె ఎక్కువగా బాలీవుడ్ మీద ఫోకస్ పెట్టేసింది. అక్కడ అజయ్ దేవగణ్‌తో వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది. రకుల్ ఈ మధ్యే తన ప్రియుడు జాకీ భగ్నానీని పెళ్లి చేసుకుంది. ఇప్పుడు రకుల్ పర్సనల్ లైఫ్‌ను బాగానే ఎంజాయ్ చేస్తోంది. రకుల్ ఎక్కువగా సినిమాలు చేయడం లేదనిపిస్తోంది. సినిమాలున్నా లేకపోయినా రకుల్ మాత్రం వ్యాయామం, యోగా, వర్కౌట్లను మాత్రం కంపల్సరీగా చేస్తుంటుంది. రకుల్ ఫిట్ నెస్, స్ట్రిక్ట్ డైట్ గురించి మంచు లక్ష్మీ చెప్పిన వీడియోలు ఆ మధ్య బాగానే వైరల్ అయ్యాయి. రకుల్ ఫుడ్ విషయంలో ఎంతో సెలెక్టివ్‌గా ఉంటుందట. ఇప్పుడు రకుల్ ఫుడ్ సీక్రెట్స్ అన్నీ కూడా అభిమానులకు తెలియబోతోన్నాయి. ఉపాసన మాధిరి రకుల్ కూడా ఫుడ్ బిజినెస్, ఫుడ్ కుకింగ్ వీడియోలను చేయబోతోన్నట్టుగా తెలుస్తోంది. ఈ వేసవి నుంచి అందరికీ ఉపశమనం కలిగించేలా ఏవైనా చిట్కాలు చెబుతుందా? ఆమె ఆహారపు అలవాట్ల గురించి చెబుతుందా? ఆమె తీసుకునే డైట్‌కు తగ్గ ఫుడ్‌ను అందరికీ నేర్పిస్తుందా? అన్నది చూడాలి. ఉగాది నుంచి మాత్రం షురూ చేస్తున్నట్టుగా చెప్పేసింది. టేస్ట్ ప్లస్ హెల్తీ అంటూ వదిలిన ఈ వీడియో ఇప్పుడు నెట్టింట్లో వైరల్ అవుతోంది. అత్తమ్మ కిచెన్ అంటూ ఉపాసన ఫుడ్ బిజినెస్ ప్రారంభించేసింది. మరి రకుల్ కూడా అలాంటిది ఏమైనా చేస్తుందా? అన్నది చూడాలి. రకుల్ చివరగా అయలాన్ అంటూ శివ కార్తికేయన్‌తో సందడి చేసింది. ఆ మూవీ కోలీవుడ్‌లో ఓ మోస్తరుగా ఆడింది. తెలుగులో ఈ మూవీ రిలీజ్‌కు పలు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఓటీటీలోనూ ఇంకా అందుబాటులోకి ఈ చిత్రం రాలేదన్న సంగతి తెలిసిందే.